క్లుప్తంగా

ఎమ్మెల్సీకి పరామర్శ



నెల్లూరు రూరల్: కారు ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని ఆయన నివాసంలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు.

దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైమ్): దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌గా ఖాజా అల్తాఫ్ హుస్సేన్ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. ఎస్సైలు, స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలతో స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యం



నెల్లూరు రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని రూరల్ నియోజకవర్గంలోని 20వ డివిజన్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నిజాముద్దీన్, జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, పార్టీ డివిజన్ ఇన్‌చార్జిలు రావు శ్రీనివాసరావు, తాళ్లూరు సురేష్‌బాబు, పద్మజాయాదవ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



నెల్లూరు సిటీ: స్వామి వివేకానంద, శారదాదేవి జయంతిని పురస్కరించుకొని నగరంలోని జీజీహెచ్‌లో ఇన్‌పేషెంట్లకు దుప్పట్లను రామకృష్ణ సేవా సమితి సహకారంతో శుక్రవారం అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్, సేవా సమితి అధ్యక్షుడు మల్లికార్జునరావు, కార్యదర్శి మురళి, శ్రీనివాసులు రెడ్డి, రామ్‌భూపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆర్ఎంఓ హెడ్ సిస్టర్ వరలక్ష్మి, సర్వేపల్లి సేవా సమితి అధ్యక్షుడు సుధీర్ పాల్గొన్నారు.

అన్నదాతల కోసం రైతు నేస్తం యాప్



మాట్లాడుతున్న సుబ్బరాజు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వ్యవసాయ విద్యుత్ సర్వీసులను పొందేందుకు వీలుగా రైతు నేస్తం యాప్‌ను రూపొందించామని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) సుబ్బరాజు పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఎస్ఈ విజయన్ ఆయనకు సాదరస్వాగతం పలికి సత్కరించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సునీల్, శీనయ్య, సతీష్, వెంకటేశ్వర్లు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ అబీదా, అసిస్టెంట్ ఇంజినీర్ (టెక్నికల్) మొహబత్‌సింగ్, తేజశ్రుతి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయొద్దు



నెల్లూరు సిటీ: జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నర్తకి సెంటర్ పరిధిలో స్పెషల్ డ్రైవ్‌ను ఎస్పీడీ సెక్షన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయకూడదని, దుకాణాల ఎదుట నో స్మోకింగ్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యూపీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ కల్యాణ్, హాసిని, సరస్వతి, సునీత పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

నెల్లూరు రూరల్: నగరంలోని రూరల్ మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. సలహా మండలి అధ్యక్షుడు పెంచల్‌రెడ్డి, ఏడీఏ శ్రీనివాసులు, ఏఓ నాగమోహన్ పాల్గొన్నారు.

సంక్రాంతి కోలాహలం



నెల్లూరు ప్రధాన బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

నగరంలో సంక్రాంతి కోలాహలం శుక్రవారం నెలకొంది. ఓ వైపు ఊళ్లకెళ్లే వారు..మరో వైపు షాపింగ్ చేసేందుకు వచ్చిన వారితో ప్రధాన రోడ్లు సందడిగా మారాయి. ఆర్టీసీ బస్టాండ్లు, ప్రధాన రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిశాయి. గాంధీబొమ్మ సమీపంలోని సండే మార్కెట్‌తో పాటు ఇతర షాపింగ్ మాళ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



బస్సెక్కేందుకు సిద్ధంగా..



ఊళ్లకెళ్తున్న విద్యార్థులు



మెయిన్ బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు



కిక్కిరిసిన సండే మార్కెట్

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



ఏబీవీపీ ఆధ్వర్యంలో..



నారాయణ వైద్య కళాశాలలో..

నెల్లూరు (టౌన్): స్వామి వివేకానంద జయంతి వేడుకలను నగరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

- ఆజాద్ సెంటర్, మాగుంట లేఅవుట్లోని వివేకానంద విగ్రహాలకు ఏబీవీపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి రాహుల్, సహాయ కార్యదర్శి నరసింహ, నేతలు సమీర్, వినోద్, విష్ణు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.
- నగరంలోని నారాయణ వైద్య కళాశాలలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. నెహ్రూ యువ కేంద్ర అధికారి మహేంద్రరెడ్డి, కృష్ణకిశోర్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రక్తదాన శిబిరాన్ని నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అజయ్‌బాబు, రెడ్‌క్రాస్ మెడికల్ షాప్ కన్వీనర్ మురళీకృష్ణ, సాయిరామ్, ట్రస్ట్ వ్యవస్థాపకుడు నివాస్, నిత్యేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రక్తదాన శిబిరం

హత్య కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో స్నేహితుడ్ని అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. చిన్నబజార్ పోలీస్‌స్టేషన్లో నిందితుల వివరాలను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఖాజానగర్‌లో ఆసిఫ్ అలియాస్ షైరా (34) నివాసం ఉంటున్నారు. గతంలో బుచ్చిరెడ్డిపాళెంలోని శాంతినగర్‌లో ఉండి ప్రస్తుతం వెంకటేశ్వరపురంలో ఉంటున్న అస్లామ్, డైకస్‌రోడ్డులో ఉంటున్న షాకీర్ అలియాస్ షారూతో పాతకక్షలున్నాయి. ఆసిఫ్‌ను ఎలాగైనా చంపాలని అదును కోసం వీరు వేచి చూడసాగారు. ఈ నేపథ్యంలో నగదు లావాదేవీల విషయమై నెల్లూరులోని పాత కోనేరు రైతుబజార్ వద్ద ఈ నెల మూడున వీరు గొడవపడ్డారు. షారూ, అస్లామ్ తమ వెంట తెచ్చుకున్న కత్తులతో ఆసిఫ్‌పై విచక్షణరహితంగా దాడిచేశారు. గాయపడిన ఆసిఫ్‌ను స్థానికులు జీజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందారు. మృతుడి భార్య మున్నీ ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ పర్యవేక్షణలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ కల్యాణరాజు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులను వైఎంసీఏ గ్రౌండ్స్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ కల్యాణరాజు, ఎస్సై సైదులు తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

కోలాహలంగా సంక్రాంతి సంబరాలు

నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గులు.. విద్యార్థులకు పతంగుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: ముత్తుకూరు రోడ్డులోని పార్థసారథినగర్‌లో గల జెనెక్స్‌లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థుల తల్లులకు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. స్కూల్ డైరెక్టర్లు వెంగళ్‌రెడ్డి, కొండలరావు, ప్రిన్సిపల్స్ అనిల్‌కుమార్, శ్రీనివాస్‌తేజ తదితరులు పాల్గొన్నారు.



రంగవల్లులను తీర్చిదిద్దుతున్న మహిళలు

ఎంపీ ఆదాలకు సంఘీభావం



నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వర్గానికి చెందిన పలువురు దళిత యువకులు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి సంఘీభావాన్ని తెలియజేశారు. త్వరలో భారీ ఎత్తున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నామని చెప్పారు. అనంతరం ఎంపీని సత్కరించారు.

న్యాయవాదుల దీక్షలు

నెల్లూరు (లీగల్): ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టం 27 / 2023ను రద్దు చేయాలని కోరుతూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రిలే దీక్షలను శుక్రవారం చేపట్టారు. జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆందోళన కమిటీ కన్వీనర్ బ్రహ్మం, నన్నే సాహెబ్, బద్దెపూడి రవీంద్ర, తన్నీరు కోటయ్య, శ్రీనివాసన్, చదలవాడ రాజేష్, రేఖారాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎమ్సీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని సండే మార్కెట్ ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొగతోట, బృందావనం, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

మిలటరీ మద్యం స్వాధీనం

నెల్లూరురూరల్: వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో ఆరు మిలటరీ మద్యం ఫుల్‌బాటిళ్లు, ఎలాంటి రసీదుల్లేని రూ.7.66 లక్షలను సీజ్ చేశామని నెల్లూరు రూరల్ ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరావు తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో వివరాలను ఆయన వెల్లడించారు. బీవీనగర్‌కు చెందిన ప్రసాద్, రమణారెడ్డి ఓ వాహనంలో వీటితో వెళ్తుండగా, పట్టుకున్నామని చెప్పారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను కోర్టులో హాజరుపర్చనున్నామని తెలిపారు.

కరసేవకులకు సన్మానం నేడు

నెల్లూరు(మినీబైపాస్): అయోధ్యలో 1990 - 92 మధ్య నిర్వహించిన కరసేవలో జిల్లా నుంచి పాల్గొన్న కరసేవకులకు సన్మానాన్ని శనివారం నిర్వహించనున్నామని కార్యక్రమ ఇన్‌చార్జి సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు.

పట్టాల పంపిణీతో తొలగిన అపోహలు



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న అనిల్‌కుమార్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కాలువ గట్లపై ఉన్న ఇళ్లను తొలగిస్తారనే అపోహలుండేవని, అయితే పట్టాల పంపిణీతో ఇవన్నీ తొలగిపోయాయని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ఆరో డివిజన్లో గల శెట్టిగుంట రోడ్డు వైవీఎం స్కూల్లో ఉడ్‌హౌస్‌సంఘం, మౌలాసాహెబ్ వీధి వాసులకు ఇళ్ల పట్టాలను శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా పట్టాలను పంపిణీ చేశామని వివరించారు. నియోజకవర్గంలో తన వల్ల ఎవరికీ ఇబ్బందులు కలగలేదని, ప్రజలందరూ ఆలోచించి వచ్చే ఎన్నికల్లోనూ తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రజల వద్దకు పలుమార్లు వచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టానని చెప్పారు. గత ఎన్నికల్లో తనపై పోటీ చేసిన వ్యక్తి నాలుగున్నరేళ్లలో ఈ ప్రాంతానికి ఇప్పటి వరకు ఒక్కసారే వచ్చారన్నారు. ఆ సమయంలో ఆయనకు హారతిచ్చిన వారికే ప్రస్తుతం తాను మొదటి ఇంటి పట్టాను అందజేశానని తెలిపారు. కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి.. అర్హులకు వర్తింపజేయాలని అదనపు కమిషనర్ శర్మద పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ప్రచార వాహనం, శిబిరాల ద్వారా అవగాహన క్యాంపును నగరంలోని వీఆర్సీ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం, అవగాహన, అర్హుల రిజిస్ట్రేషన్, ఆధార్ అప్‌డేట్, పీఎం స్వనిధి పథకం, ముద్ర లోన్, బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్వాగత.. ఉత్సవ.. కల్చరల్ కమిటీలను ఏర్పాటు చేసి నగర పాలక సంస్థ పరిధిలోని ఎనిమిది ప్రాంతాల్లో శిబిరాలను ఈ నెల 25 వరకు నిర్వహించనున్నామని తెలిపారు. సంకల్ప యాత్ర కన్వీనర్లు రాధాకృష్ణగౌడ్, రవిశంకర్, అశోక్, రాజేశ్వరి, మెప్మా పీడీ రవీంద్రబాబు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, తహసీల్దార్ నిర్మలానందబాబా, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్వో ప్రసాద్, సెక్రటరీ హేమావతి, ప్రభుత్వ వైద్యురాలు జిజియాబాయి, నాగసాయిసూరి తదితరులు పాల్గొన్నారు.



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం

నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని డీఎస్ఎస్పీఎస్ క్యాంపస్‌లో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా వార్షికోత్సవ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సీనియర్ పాస్టర్లు అబ్రహాం, స్టాన్లీ, లూథర్‌బాబు, భాస్కరయ్య, ఇజాక్‌ను సత్కరించారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా గడ్డం హనోక్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా కిశోర్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జాషువా, ఉపాధ్యక్షులుగా రాజు, సదాశివరావు, సహాయ కార్యదర్శులుగా శ్యామ్‌ప్రసాద్, పీటర్ ఆత్మామీనస్, సుధీర్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా ఎనోష్, సునీల్ గావస్కర్‌ను ఎన్నుకున్నారు. సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్, జయప్రకాష్, బెన్హర్‌బాబు, ఫాదర్ ఫ్రాన్సిస్, ఎన్సీఎఫ్ అధ్యక్షుడు శరత్, సురేంద్రబాబు, రాజశేఖర్, బర్నబాస్, రాజేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సత్కారం పొందిన పాస్టర్లతో నిర్వాహకులు

గోదాదేవికి విశేష పూజలు



కృష్ణ మందిరంలో..



నరసింహకొండలో..

నెల్లూరు(బృందావనం): ధనుర్మాస పూజల్లో భాగంగా వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో కృష్ణుడు, గోదాదేవి అమ్మవార్లకు కుడారైవెల్లుమ్‌ను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. మందిరంలో స్వామివార్లకు 108 పాత్రల్లో పాయసం తదితరాలను నైవేద్యంగా సమర్పించారు. మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తలుగా వాయుగుండ్ల సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులు, మునుకూరు ప్రభాకర్‌రెడ్డి, నిర్మలమ్మ, శ్రీదేవి వ్యవహరించారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, సుబ్బరామరాజు, ఉపాధ్యక్షుడు మాలకొండయ్య, వేణుగోపాల్, కోశాధికారి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, భానుమతి, రజనీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గోదాదేవి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెంచయ్యకు ఘన నివాళి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న యాకసిరి చెంచయ్య నగరంలోని తన నివాసంలో గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఈ క్రమంలో మేయర్ స్రవంతి, జయవర్ధన్ దంపతులు మృతుడి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు తక్షణ సాయంగా రూ.20 వేలను మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరఫున అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శీనయ్య, నగరపాలక సంస్థ మేనేజర్ ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న స్రవంతి

పాదయాత్రకు ఘన స్వాగతం

నెల్లూరు (వేదాయపాళెం): రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 175 స్థానాల్లో విజయం సాధించడంతో పాటు జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించాలని కాంక్షిస్తూ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు బసవరాజు చేపట్టిన పాదయాత్ర నగరానికి శుక్రవారం చేరుకుంది. కరెంటాఫీస్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపన అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు, సునీత ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడారు. ఇడుపులపాయలో నవంబర్ 17న చేపట్టిన పాదయాత్ర ఇచ్ఛాపురం వరకు కొనసాగనుందని వివరించారు. దళిత నేతలు డేవిడ్, విజయ్, జాన్సన్, న్యాయవాది మురళీకృష్ణ, కాకులూరు శ్రీనివాసులు, తాళ్లూరు పృథ్వీ, సిద్ధవరపు పెంచలయ్య, కాకులూరి శీనయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు

